సాక్షి తిరుపతి

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. - 6లో



భద్రతా ప్రమాణాలు పాటించండి

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పక పాటించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. - 6లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	36	26
చిత్తూరు	34	25
తిరుమల	30	21
గూడూరు	36	27
నగరి	35	26

న్యూస్‌రీల్

గవర్నర్‌కు వీడ్కోలు



గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

రేణిగుంట: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు శనివారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. రెండు రోజులు పర్యటన అనంతరం ఆయన మధ్యాహ్నం 12.55 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు, రేణిగుంట తహసీల్దార్ శివప్రసాద్, ఎయిర్ పోర్ట్ అధికారులు వీడ్కోలు పలికారు.



శోభాయమానంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై దేవదేవేరుల పరిణయోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

పెళ్లిసందడి

తిరుమలలో పెళ్లి సందడి నెలకొంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీపద్మావతీ పరిణయోత్సవాలను టీటీడీ ఆగమోక్తంగా ప్రారంభించింది. మొదటి రోజు శనివారం నారాయణగిరి ఉద్యానవనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అష్టలక్ష్మీ దశావతార మండపంలో నిత్యనూతన వధూవరులైన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి పూలదండలు మార్చుకోవడం, పూల బంతులాట, నూతన వస్త్ర సమర్పణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకలకు భూలోక వైకుంఠాన్ని తలపించేలా కల్యాణ మండపాన్ని ఫలపుష్పాదులతో చూడముచ్చటగా తీర్చిదిద్దింది. ఉదయం స్వామివారు గజవాహనాన్ని అధిరోహించి ఉభయనాంచారులతో పల్లకీపై ఊరేగుతూ పరిణయోత్సవ మండపానికి వేంచేశారు. కల్యాణం అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామి వారు బంగారు తిరుచ్చిపై అశేష భక్తజనం మధ్య ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేయడంతో మొదటి రోజు కల్యాణ ఘట్టం ముగిసింది.

– తిరుమల



శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామివారు



కల్యాణ మండపానికి అమ్మవార్లను తీసుకువస్తున్న అర్చకులు

కాల్ డ్రైవర్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు గడిచిన వారిని ఆర్టీసీలో కాల్ డ్రైవర్లుగా తీసుకోనున్నట్టు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు. రోజు వారి వేతనం రూ.800 ఇస్తామని, అదనపు డ్యూటీలు చేస్తే రోజుకు రూ.260 ఇస్తారని స్పష్టం చేశారు. జిల్లాలో 39 మంది కాల్ డ్రైవర్లు అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కల్యాణం..కమనీయం

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ, నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండలపంలో కొలువు దీర్చి శోభాయమానంగా అలంకరించారు. తర్వాత వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణం జరిపించారు. రాత్రి ఊంజల్‌సేవ నేత్రపర్వంగా సాగింది.



విశేషాలంకరణలో స్వామి,అమ్మవార్లు

వైద్యపరీక్షల నిర్వహణ చరిత్రాత్మకం



సూచనలు ఇస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి



ఈసీజీ తీస్తున్న వైద్య సిబ్బంది

- మెగా మెడికల్ క్యాంపును పరిశీలించిన కలెక్టర్ వెంకటరమణారెడ్డి

పాకాల: నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంతో ఉండాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తలపెట్టి మెగా మెడికల్ క్యాంప్ కార్యక్రమం ఒక చరిత్రాత్మకమని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి కొనియాడారు. శనివారం దామలచెరువు జెడ్పీ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఇప్పటి వరకు సుమారు 4 వేల మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. వైద్యశిబిరం వద్దకు వచ్చేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు అన్ని వసతులు కల్పించారని కొనియాడారు. స్థానికంగా నివసించే వారితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తుడా వీసీ హరికృష్ణ, డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి, తుడా సెక్రటరీ లక్ష్మి, ఎస్‌డీసీ భాస్కర్‌నాయుడు, తిరుపతి డివిజన్ పీఓ రూపారాణి, సుశీలదేవి, ఎంపీడీఓ రమేష్‌బాబు, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, సర్పంచ్ సునిత పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించండి

తిరుపతి అర్బన్: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానంలో ఏప్రిల్‌లో 36 పరిశ్రమలకుగాను 20 పరిశ్రమ లకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. పరిశ్రమల పరిశీలన కమిటీ సూచనల మేరకు 16 పరిశ్రమలకు పెట్టుబడి సబ్సిడీ ప్రోత్సాహకాల ద్వారా రూ.93.88 లక్షలు అందించినట్టు వెల్లడించారు. అనంతరం క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమంలో ఏర్పేడు మండలం మధవమా ల గ్రామంలో వుడ్ కార్వింగ్, రేణిగుంట మండలం, ఎర్రమరెడ్డిపాలెం గ్రామంలో కాపర్ వేజెల్స్ క్లస్టర్, వెంకటగిరిలో శారీ ప్రింటింగ్, డైయింగ్ క్లస్టర్, నారాయణవనంలో పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు చేపట్టిన చర్యల్లో పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్‌రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ తిరుపతి చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నరేంద్రబాబు, జిల్లా ఫైర్ ఆఫీసర్ రమణయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి .. దేశ ప్రగతికి దిక్సూచి

- భాకరాపేట పంచాయతీ ఆర్థిక పురోగతి సంతోషం
- గడప గడపకు మహా పాదయాత్రలో
  చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



గజమాలతో సత్కారం, భాకరాపేటలో భారీ జనసందోహంతో ముందుకు సాగుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : గ్రామాల అభివృద్ధే దేశ ప్రగతికి దిక్సూచి అని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. భాకరాపేట పంచాయతీలో శనివారం గడపగడపకు మహా పాదయాత్ర కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. సర్పంచ్ సాకిరి భూపాల్ ఆధ్వర్యంలో భాకరాపేట కూడలిలో 27 అడుగల భారీ గజమాలతో మోహిత్‌రెడ్డిని ఆత్మీయంగా సత్కరించారు. అంతకుముందు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు.

గ్రామాలలో సకల సదుపాయాలు

గ్రామాల్లో ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, జీవనోపాధి, చెట్లను నాటడం, నీటి వనరుల నిర్వహణ వంటి సకల సదుపాయాలు కల్పించినట్టు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలో ఉచితంగా 10 లక్షలు మొక్కలు పంపిణీ చేశారని వెల్లడించారు. భాకరాపేట పంచాయతీలో రూ.5.39 కోట్లతో అభివృద్ధి పనలు చేపట్టగా ఇందులో రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం జరిగిందన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

టీడీపీకి చెందిన భాకరాపేట మాజీ సర్పంచ్ బోరుగుంట్ల నాగమ్మ, భర్త చిన్నయ్య ఇరువురితో పాటు వారి అనుచరులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, వైస్ ఎంపీపీ సునీత, డివిజన్ అధ్యక్షుడు గురుశంకర్, ఉప సర్పంచ్ ఉమాభార్గవి, జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు షాబాద్‌అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభీష్టం.. కొండత బలం

జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం భాకరాపేటలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రజాభీష్టం తమకు కొండంత బలమన్నారు. జగనన్న పాలన పట్ల కోటి 10 లక్షల మంది తమ ఫోన్ కాల్ ద్వారా సమాచారం ఇచ్చి మద్దతు తెలిపారని చెప్పారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,150
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,551
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,900
రిటైల్ వెండి గ్రాము	రూ.78.90

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు మాత్రమే నిండాయి. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రైళ్లపై రాళ్లు విసిరితే నాన్ బెయిలబుల్ కేసులు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ


గూడూరు : రైళ్లపై రాళ్లు విసిరితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఆర్‌పీఎఫ్ సీఐ ఎల్ నారాయణ తెలిపారు. ఇటీవల వందే భారత్ రైలుపై రాళ్లు విసిరిన నేపథ్యంలో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా సీఐతో పాటు జీఆర్‌పీ ఎస్‌ఐ కొండపనాయుడు, స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులతో కలిసి శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైళ్లపై రాళ్లు విసరడం తీవ్ర నేరమని, దాన్ని 153 భారతీయ రైల్వే చట్టం కింద కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

నీటి కుంటలోపడి ఇంటర్ విద్యార్థి మృతి


తేజ మృతదేహం

చిట్టమూరు: ఇంటర్ విద్యార్థి నీటి కుంటలో పడి మృతిచెందిన ఘటన శనివారం మండలంలో విషాదాన్ని నింపింది. వివరాలు.. మండలంలోని కుమ్మరిపాళెం గ్రామానికి చెందిన ఎర్రబోతు చెంగయ్య, స్వర్ణలత దంపతుల కుమారుడు తేజ(16) నెల్లూరులోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేశాడు. వేసవి సెలవుల నేపథ్యంలో ఇంటికొచ్చిన తేజ స్నేహితులతో కలిసి బురదగల్లి గ్రామానికి క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. ఆట ముగిసిన తర్వాత పక్కనే ఉన్న కుంటలో ఈతకొట్టేందుకు దిగి బురదలో కూరుకుపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కుంటలో గాలించి తేజ మృతదేహాన్ని బయటకు తీశారు. చిట్టమూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితుడికి నగదు చెల్లింపు


రజాక్‌కు రూ.7 వేలు ఫోన్‌పే చేసిన దృశ్యం

తిరుపతి తుడా : తిరుపతి రుయా ఆస్పత్రి సదరమ్ కేంద్రంగా అక్రమాలకు పాల్పడుతున్న సుబ్రమణ్యం ఎట్టకేలకు స్పందించి బాధితుడికి డబ్బు తిరిగి చెల్లించాడు. రుయా వేదికగా సదరమ్ సర్టిఫికెట్ల కోసం వచ్చే పేదల నుంచి సుబ్రమణ్యం వేల రూపాయలు దండుకున్నాడు. బాధితుల ఆవేదనతో 'సాక్షి'లో వరుస కథనాలు వచ్చాయి. దీంతో సుబ్రమణ్యం తల్లి స్పందించి మరో వ్యక్తి ద్వారా పాకాల మండలం, రమణయ్యగారి పల్లెకి చెందిన బాధితుడు రజాక్‌కు డబ్బులు తిరిగి చెల్లించారు. రజాక్ దగ్గర సదరమ్ అప్లికేషన్ గతంలో రూ.10 వేల వరకు వసూలు చేసిన విషయం తెల్సిందే. రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్ చొరవ తీసుకోవడంతో బాధితుడికి న్యాయం జరిగింది.

ఐటీ రంగంలో ఉద్యోగాలకు శిక్షణ

తిరుపతి అర్బన్: ఐటీరంగంలో ఉద్యోగాలకు ప్రత్యేకంగా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి శనివారం పేర్కొన్నారు. ప్రధానంగా హెచ్‌సీఎల్-టెక్ బీ ఐటీ రంగంలో ట్రైనింగ్ ప్రోగ్రాంకు ఆసక్తిగల అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్-టెక్ బీ కార్యక్రమంలో శిక్షణ పొందడానికి ఇంటర్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అయితే 2021-22లో ఇంటర్‌లో 60 శాతం మార్కులు, 2022-23లో అయితే 75 శాతం మార్కులు సాధించి ఉండాలని చెప్పారు. ఎంపికైన వారికి ట్రైనింగ్ ప్రోగ్రాం కాలపరిమితి ఒక సంవత్సరం ఉంటుందని, మొదటి 6నెలలు తరగతి గదిలో టీచింగ్, తర్వాత అభ్యర్థి ఇంటర్న్‌షిప్ నిర్దేశించిన హెచ్‌సీఎల్ క్యాంపస్‌కు వెళ్లాలని చెప్పారు. ఆ సమయంలో అభ్యర్థికి నెలకు రూ.10వేలు అందజేస్తారన్నారు. అదనపు సమాచారం కోసం 9032697478, 7675827308, 8074919939, 9963859160 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.